క్లుప్తంగా

ఏటుకూరుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలి

వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు ఏటుకూరు బైపాస్‌లోని పార్టీ కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున తరలి రావాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వినుకొండలో టీడీపీ గూండాల చేతిలో దారుణ హత్యకు గురైన రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఉదయం పది గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలు దేరి రోడ్డు మార్గాన గుంటూరు, చిలకలూరిపేట, నరసరావుపేట బైపాస్ మీదుగా వినుకొండ చేరుకుంటారని తెలిపారు. అందుచేత నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా భారీ సంఖ్యలో ఏటుకూరు బైపాస్ వద్దకు తరలిరావాలని, అక్కడి నుంచి జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి వినుకొండ వరకు వెంట నడిచి పరామర్శలో పాల్గొనాలని కిరణ్‌కుమార్ పార్టీ శ్రేణులను కోరారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

లక్ష్మీపురం: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో 7వ తరగతి విద్యార్థినిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, ఉపాధ్యక్షురాలు సుచరిత డిమాండ్ చేశారు. గురువారం విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం చేయాలంటూ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ విద్యార్థిని కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.10 లక్షల ఆర్థిక సాయం చేయలని డిమాండ్ చేశారు. ఆరీఫా, దళిత ప్రజా సంఘాల నాయకులున్నారు.

విద్యార్థినులకు ప్రతిభ ఉపకార వేతనాలు



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల విద్యార్థినులు వైకేఆర్ మెమోరియల్ ట్రస్ట్ నుంచి ప్రతిభ ఉపకార వేతనాలు అందుకున్నట్లు ప్రిన్సిపల్ సిస్టర్ విమల మేరీ తెలిపారు. గురువారం కళాశాలలో ఉపకార వేతనాలు అందుకున్న 24 మంది విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం పెద పలకలూరులో జరిగిన కార్యక్రమంలో టెస్ట్ పరీక్ష ఫలితాల్లో అధిక మార్కులు సాధించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు నలుగురితో పాటు సీనియర్ ఇంటర్ విద్యార్థులు 20 మంది ఉపకార వేతనాలు అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంఈఓకు ఎన్‌టీఏ సభ్యుల అభినందనలు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఎంఈఓ కార్యాలయంలో గురువారం గుంటూరు తూర్పు, పశ్చిమ ఎంఈఓ-1గా బాధ్యతలు చేపట్టిన బీవీ రమణయ్యను కలసిన ఎన్‌టీఏ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హైమారావు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. ఎంఈవో రమణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు టీడీఎస్ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంఈఓను కలసిన వారిలో ఎన్‌టీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ ఖలీల్, ఎన్వీ జగదీష్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి జి.అంతోనీబాబు, సహాధ్యక్షులు వి.సంతోష్‌కుమార్, ఎం.చంద్రశేఖర్, నగర అధ్యక్షుడు పి.సాయి విశ్వనాథ్, నగర నాయకులు ఉన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధం

దొండపాడు(తాడికొండ): తుళ్లూరు మండలం దొండపాడు గ్రామంలో గురువారం రెండు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన నన్నపనేని నాగేశ్వరరావు, నన్నపనేని హనుమంతరావులకు చెందిన గృహాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. రెవెన్యూ అధికారులు నష్టం వివరాలు నమోదు చేశారు. ఒక్కో ఇంటికి రూ.3 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు.

కలుషిత నీరు.. నిర్లక్ష్యంలో యంత్రాంగం

- శుద్ధి చేయని నీటి సరఫరాతో ప్రజల జీవితాలతో చెలగాటం
- కుళాయిల ద్వారా రంగు మారిన నీటి సరఫరా
- వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు



కుళాయి ద్వారా సరఫరా అవుతున్న రంగు మారిన నీరు



పొన్నూరుకు సరఫరా చేసే రక్షిత మంచినీటి పథకం

పొన్నూరు: వర్షాకాలం రోగాలు ప్రబలే సీజన్.. ప్రజారోగ్యం కోసం అధికార యంత్రాంగం తగిన జాగ్రత్తలు పాటించాలి. శుద్ధ నీటిని అందించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాల్సిన అవసరం ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రక్షిత మంచి నీటి పథకంతో నిత్యం కుళాయిల ద్వారా సరఫరా అయ్యే తాగు నీటిని శుద్ధి చేయడంలో విఫలమవుతున్నారు. దీంతో కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

- ప్రజలకు శుద్ధజలం అందిస్తున్నామని ప్రభుత్వం, అధికారులు, పాలకులు పదే పదే చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. కనీసం శుద్ధి చేయకుండా నేరుగా సరఫరా చేస్తూ.. పట్టణ ప్రజల జీవితాలలో చెలగాటం ఆడుతున్నారు. నీటి సరఫరా విభాగం అధికారులు, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల ప్రాణాలపైకి వచ్చింది. తాగునీటి పథకాల నిర్వహణ, మరమ్మతుల కోసం లక్షల రూపాయల నిధులు వెచ్చిస్తున్నారు. ఆ నిధులు ఎక్కడికి పోతున్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

-కుళాయిల ద్వారా రంగు మారిన నీరు సరఫరా.. నిడుబ్రోలు రక్షిత తాగునీటి పథకం నుంచి తాగు నీటి సరఫరా చేస్తున్నారు. పొన్నూరు, నిడుబ్రోలు పరిధిలో సుమారు 15 వేలకు పైగా తాగునీటి కుళాయిల ద్వారా నీటి సరఫరా అవుతుందని ప్లాంట్ నిర్వాహకులు చెబుతున్నారు. నిడుబ్రోలు పరిధిలో నీటిని శుద్ధి చేయకుండానే తాగునీరు సరఫరా చేస్తున్నారని, కొన్ని రోజులుగా ఎర్రగా మారిన తాగు నీరు సరఫరా అవుతోందని స్థానికులు చెబుతున్నారు. ఆ నీరు తాగి రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ట్యాంకులు శుభ్రం చేయడం లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అధికారులు పర్యవేక్షించడం లేదు. ఇటీవల పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మంచినీటి పథకం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించకపోతే సహించేది లేదని హెచ్చరించారు. అయినా అధికారుల్లో ఎలాంటి మార్పు రాలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శుద్ధమైన తాగునీరు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వెంటనే సమస్యను పరిష్కరిస్తాం



రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా అయ్యే తాగునీటి నాణ్యతలో ఎలాంటి సందేహం లేదు. స్వల్పంగా రంగు మారిన నీటితో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఫిల్టర్ బెడ్లు మార్చాల్సిన అవసరం ఉంది. ఏళ్ల తరబడి ఫిల్టర్ బెడ్లు మార్చకపోవడంతో సమస్య ఏర్పడుతోంది. త్వరలోనే ఫిల్టర్ బెడ్లు మార్పిడి చేసి సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తాం.

– ఏడుకొండలు, మున్సిపల్ డీఈ

ఉపాధి పనులు బాధ్యతగా నిర్వహించండి



మాట్లాడుతున్న డ్వామా పీడీ ఉమాదేవి

పెదకాకాని: బాధ్యతగా విధులు నిర్వహించాలని డ్వామా పీడీ ఉమాదేవి అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా జరిగిన రూ.7,16,21,061 పనులపై ఈ నెల 4వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ సామాజిక తనిఖీ బృందాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం సభ్యులు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి పనుల నిర్వహణలో జరిగిన అవకతవకలను వెల్లడించారు. గ్రామాల్లో పనులకు సంబంధించిన వివరాలు తెలియజేస్తూ బోర్డులు ఏర్పాటు చేసినట్లు నగదు పొందేందుకు బిల్లులు పెట్టారని వారు వివరించారు. అలానే గోళ్ళమూడి గ్రామంలో చనిపోయిన వ్యక్తి వారం రోజులు పని చేసినట్లు మస్టర్‌లో నమోదు చేసి నగదు చెల్లించారన్నారు. అధికారులు మస్టర్ వెరిఫికేషన్‌లో సంతకాలు చేయలేదన్నారు. ఉప్పలపాడు గ్రామంలో 78 మందికి చెందిన జాబ్‌కార్డుల వివరాలు లేవని వెల్లడించారు. ఆశా వర్కర్లకు ఉపాధి పనులు కల్పించి వేతనాలు ఇచ్చారని, ఫించన్‌లు కూడా పంపిణీ చేస్తున్నారని, 49 రోజులు పని చేసిన వ్యక్తికి వేతనం ఇవ్వలేదని, సంతకం, వేలిముద్ర లేకుండానే పలువురికి వేతనాలు చెల్లించారని పేర్కొన్నారు. సోషల్ ఆడిట్ గ్రామ సభ పర్యవేక్షణ సిబ్బంది లేకుండానే సభ నిర్వహించారు. అనంతరం డ్వామా పీడీ ఉమాదేవి మాట్లాడుతూ బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, డ్వామా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, ఏపీడీ బాలమ్మ, స్టేట్ రిసోర్స్ పర్సన్ అచ్యుతరావు, ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ధన్యవాదాలు

పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ విద్యాభివృద్ధికి, వెనుకబడిన కళాశాలల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చూపిన చొరవ ప్రశంసనీయమన్న అభిప్రాయాన్ని ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వ్యక్త పరిచింది. అసోసియేషన్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి విద్యాసాగర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఇటీవల ప్రభుత్వం ఇంజనీరింగ్ కళాశాలలు మెరుగైన సౌకర్యాలతో విద్యాప్రమాణాల పెంపుకు కృషి చేసే విధంగా చూపిన చొరవను అభినందించారు. గత 10 సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా మొదటి దశ కౌన్సెలింగ్ త్వరితగతిన పూర్తి చేసి జులై 19 నుంచి తరగతులు ప్రారంభించేలా చొరవ తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌కు అసోసియేషన్ ధన్యవాదాలు తెలియజేసింది. మంత్రి లోకేశ్ చొరవతో గత సంవత్సరం కంటే అదనంగా 20 వేల మంది విద్యార్థులు మన రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే సౌలభ్యం కలిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ 2023 సిఫార్సుల ఆధారంగా కళాశాలల రుసుము రూ.43,000 నుంచి గరిష్టంగా రూ.1,05,000 వరకు అమలు చేసినందుకు, విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఫీజు బకాయిలు సత్వరం చెల్లించటానికి మంత్రి లోకేశ్ చొరవ తీసుకుంటానని ఎక్స్ వేదికగా హామీ ఇచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో ప్రెసిడెంట్ వాసిరెడ్డి విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ మధుసూదన్‌రావు, వైస్ ప్రెసిడెంట్ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్సీ, ట్రెజరర్ సత్యనారాయణ, సభ్యులు రాజలింగం, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

జీవిత బీమా రుణాలు, బాండ్ల చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించాలి



జేడీ అశోక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: జీవిత బీమా రుణాలు, బాండ్ల చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పేర్కొన్నారు. గురువారం మంగళదాస్ నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా (ఏపీజీఎల్ఐ) ప్రాంతీయ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ డి.అశోక్‌ను కలసిన యూటీఎఫ్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీజీఎల్ఐ ద్వారా రుణాలు, బాండ్ల చెల్లింపులు సత్వరమే జరిగే విధంగా చూడాలని కోరారు. రుణాలు, క్లోజర్ల దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండలం వల్ల అవసరానికి డబ్బులు పొందలేక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదే విధంగా నూతన వెబ్‌సైట్‌లో ఖాతాలు తప్పుల తడకగా ఉన్నాయని, వీటిని సవరించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై తగు చర్యలు తీసుకుంటామని జేడీ అశోక్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. జేడీని కలసిన వారిలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకుడు మూర్తి, ఏపీజీఎల్ఐ కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.పోతురాజు న్నారు.


అవుట్‌ఫాల్ డ్రెయిన్ పూడికతీత

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని చినకాకాని నుంచి వర్షపునీరు, మురుగునీరు బయటకు వెళ్లేందుకు కార్పొరేషన్ అధికారులు పూడికతీత పనులను గురువారం ప్రారంభించారు. చినకాకాని శివారు ప్రాంతంలో మురుగునీరు వెళ్లే కచ్చా డ్రెయిన్లలో సిల్ట్ పేరుకుపోయి, మురుగునీరు, వర్షపు నీరు ప్రధాన వీధుల్లోంచి ప్రవహించడం కష్టంగా మారింది. దీంతో ఇంజినీరింగ్ అధికారులు అవుట్‌ఫాల్‌లో చెత్తాచెదారం తీసివేస్తే మురుగునీరు బయటకు పోతుందని భావించి ఎంటీఎంసీ కమిషనర్ ఆలీబాషా దృష్టికి తీసుకువెళ్లడంతో యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించడంతో డీఈ కృష్ణారెడ్డి పర్యవేక్షణలో సుమారు 500 మీటర్ల పొడవున పూడికతీత పనులను చేపట్టారు. ఈ డ్రెయిన్ వల్ల మురుగునీటి సమస్య 90 శాతం పరిష్కారం అవుతుందని సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది తెలిపారు.

పన్నులు సత్వరం చెల్లించాలి

ఫిరంగిపురం: పంచాయతీ పరిధిలో ఇంటిపన్ను చెల్లించాల్సిన యజమానులు త్వరితగతిన చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి కె.విష్ణువర్ధనరావు అన్నారు. ఫిరంగిపురం పంచాయతీ పరిధిలో ఇప్పటివరకు 50శాతం ఇంటిపన్నులు వసూలు చేశామన్నారు. గ్రామంలోని రాజాపేట, కొత్తపేట, రసూల్‌పేట, తూర్పుబజార్, ప్రధానరోడ్, సొలసబస్టాండు సెంటర్, వంటి ప్రాంతాల్లో ఇంకా వసూలు కావాల్సి ఉందన్నారు. త్వరితగతిన పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

హాస్టల్స్‌లో సమస్యల పరిష్కారానికి వినతి



లక్ష్మీపురం: గుంటూరు జిల్లాలోని హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదన్‌రావును ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ మున్సిపల్ ఎస్సీ బాలల వసతి గృహానికి ప్రహరీ, బీసీ హాస్టల్‌లో ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని, హాస్టల్ అడ్మిషన్స్‌ను నూరుశాతం ఇవ్వాలని కోరారు. వసతి గృహాల్లో సౌకర్యాల కొరత, మెస్, కాస్మోటిక్ చార్జీల పెండింగ్, భవనాల అద్దె చెల్లింపు తదితర అంశాలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని డీడీ హామీ ఇచ్చారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు బి.సుచరిత, జిల్లా కమిటీ సభ్యులు ఎ.యశ్వంత్ ఆరిఫా ఉన్నారు.

తడి,పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలి



మేడికొండూరు: మండలంలోని డోగిపర్రు గ్రామ పంచాయతీలో ప్రతి ఇంటి వద్ద నుంచి వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. హరితరాయబారుల ద్వారా సేకరించిన చెత్త నుంచి సంపద తయారీ జరుగుతోందని పంచాయతీ సెక్రటరీ బి.రమేష్, మాజీ ఎంపీపీ సుబ్బారావు తెలిపారు. కేంద్రంలో వ్యర్థాలను వేరు చేసి వాటిని ఎరువుగా మార్చి గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూర్చడం జరుగుతోందన్నారు. గ్రామ ప్రజలందరూ, దుకాణదారులు ఇళ్ల వద్దకు వచ్చే హరిత రాయబారులకు ఇంటినుంచి వచ్చే వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి ఇవ్వాలన్నారు. గ్రామ ప్రజలందరూ గమనించాలన్నారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శర్వాణి, గ్రామ పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబరు 77ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న నాసర్‌జీ

లక్ష్మీపురం: పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల ఉన్నత చదువులకు ఆటంకంగా మారిన జీఓ నంబరు 77ను తక్షణమే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. స్థానిక కొత్త పేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్స్ పర్యటన చేసి, ఆగస్టు 6న జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు యశ్వంత్ దుర్గా సాయి, శివ, డేవిడ్, గౌతమ్, కిరణ్, బన్నీ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ఆర్డీవో ఆకస్మిక తనిఖీలు



పెట్రోలు బంకులో సీల్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో పి.శ్రీకర్

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో గురువారం సాయంత్రం గుంటూరు ఆర్డీవో పి.శ్రీకర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక పౌర సరఫరాల గిడ్డంగిలోని రేషన్ బియ్యం నిల్వలతో పాటు ఆయిల్, కందిపప్పు నిల్వలను పరిశీలించారు. ఎంత స్టాక్‌ను రేషన్ షాపులకు సరఫరా చేశారు? నిల్వ ఎంత ఉంది అన్న వివరాలను గోడౌన్ ఇన్‌చార్జి అలేఖ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిస్టర్లలో ఉన్న లెక్కలకు, స్టాక్ నిల్వలకు వ్యత్యాసాలేమైనా ఉన్నాయా అని బియ్యం బస్తాలను లెక్కించి చూశారు. అనంతరం మెయిన్ రోడ్డులో సివిల్ సప్లయిస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెచ్‌పీ పెట్రోలు బంకులోనూ తనిఖీలు చేశారు. మిషన్లకు సీల్ వేసి ఉందా? లేదా? ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ సిలిండర్లు పని చేస్తున్నాయా? లేవా? అన్న వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు రూంను పరిశీలించారు. ఇటీవల కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగుల మధ్య జరిగిన వివాదం నేపథ్యంలో రికార్డు రూంను పరిశీలించినట్లు తెలుస్తోంది. సాధారణ తనిఖీల్లో భాగంగానే గోడౌన్‌లోని స్టాక్‌తో పాటు, పెట్రోలు బంకుల్లో తనిఖీలు చేశామని ఆర్డీవో శ్రీకర్ తెలిపారు. ఆయన వెంట సీఎస్ డీటీ పద్మజ, తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్ ప్రశాంతి తదితరులున్నారు.

రుచి లేని వంటలు.. పొంతనలేని సమాధానాలు

- నీళ్ల సాంబారును తలపిస్తున్న పప్పు
- కేంద్రాల్లో కనిపించని మెనూ బోర్డులు



వి.నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో...



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. నిన్న మొన్నటి వరకు రుచిగా శుచిగా చిన్నారులకు నాణ్యమైన భోజనాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోనే అందించిన కార్యకర్తలు ఇప్పుడు నాణ్యతను గాలికొదిలేశారు. మెనూను పక్కన బెట్టి వారికి తోచింది వండి వార్చుతున్నారు. రుచి లేని వంటలు వండి వార్చుతూ, పసలేని సమాధానాలు చెబుతున్నారు. అందుకు సాక్ష్యమే ఈ చిత్రాలు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూను పాటించకపోగా, వండిన వంటల్లో సైతం నాణ్యత లోపించింది. వి.నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆకుకూర పప్పును వండి పెట్టారు. అయితే ఆ పప్పు నీళ్ల సాంబారును తలపిస్తోంది. ఆ నీళ్ల పప్పునే ప్లేటులో వడ్డించి చిన్నారులకు కలిపిపెట్టారు. అదే గ్రామంలోని చెరువు కట్టపై జెండా చెట్టు సెంటరులో ఉన్న మరో అంగన్‌వాడీ కేంద్రంలో అయితే పిల్లలకు ఆకుకూరలతో సాంబారు వడ్డించినట్లు సిబ్బంది చెప్పారు. కానీ అందులో సాంబారు జాడే కనిపించలేదు.

పసలేని సమాధానాలు..

మెనూపై వి.నగర్ అంగన్‌వాడీ కార్యకర్తను ప్రశ్నించగా ఈ రోజు మెనూ ఆకుకూర పప్పని తెలిపారు. కాగా ఆయా మాత్రం ఆకుకూరల సాంబారంటూ సెలవిచ్చారు. మరో అంగన్‌వాడీ కేంద్రంలో సాంబారని కార్యకర్త చెబుతున్నప్పటికీ పిల్లలు మాత్రం వేరే కూరలతో భోజనం చేస్తూ కనిపించారు. ఆయా విషయాలపై ప్రాజెక్టు సీడీపీవో వి.సుజాతదేవిని వివరణ కోరగా ఈ నెల కందిపప్పు షార్టేజీ వచ్చిందని తెలిపారు. అయినా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఆ దిశగా కచ్చితమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. కేంద్రాల్లో తప్పనిసరిగా మెనూ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించామని స్పష్టం చేశారు.

కళాశాలల్లో 'విరాజి' చిత్ర బృందం సందడి



నంబూరు వీవీఐటీలో మాట్లాడుతున్న హీరో వరుణ్‌సందేశ్



మలినేని కళాశాలలో విరాజీ చిత్ర యూనిట్

పెదకాకాని: నంబూరు వీవీఐటీ కళాశాలలో హ్యాపీడేస్ ఫేమ్ వరుణ్ సందేశ్ హీరోగా ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్న విరాజి చిత్ర బృందం సందడి చేసింది. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆగస్టు 2న విడుదల కానున్న విరాజి చిత్రం ప్రచార కార్యక్రమం గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా చిత్ర హీరో వరుణ్‌సందేశ్ మాట్లాడుతూ తన కెరియర్‌లో గుర్తుండిపోయే చిత్రం విరాజి అవుతుందన్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వచ్చిందని, ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందని చెప్పారు. చిత్ర బృంద సభ్యులు విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర హీరోయిన్‌లు కుషాలిని, అపర్ణాదేవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

మలినేనిలో 'విరాజి'...

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం విరాజి సినిమా యూనిట్ సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా కళాశాలలో చిత్ర కథానాయకుడు వరుణ్ సందేశ్, నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల, దర్శకుడు ఆద్యంత్ హర్షలు కళాశాలలో పర్యటించి విద్యార్థినులతో ముచ్చటించారు. ఆగస్టు 2వ తేదీన విరాజి సినిమా విడుదల కాబోతుందని, తమను ఆదరించాలని కోరారు. కొత్తబంగారులోకం సినిమాతో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న వరుణ్ సందేశ్ డిఫరెంట్ లుక్, హెయిర్ స్టైల్‌తో కనిపించి కళాశాలలో కిర్రాక్ చేశారు.

ముగిసిన మొహర్రం వేడుకలు



కొమ్మూరులో పీర్ల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



సమాధిని పూడ్చివేస్తున్న మత పెద్దలు

- కొమ్మూరులో ఘనంగా మొహర్రం వేడుకలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న ముస్లింలు
- గ్రామంలో వీధి వీధిన పీర్ల ఊరేగింపు

కొమ్మూరు(కాకుమాను): మండలంలోని గ్రామాలలో మొహర్రం వేడుకలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు మండలంలోని కొమ్మూరులో సాయంత్రం రంగు రంగుల జెండాలతో విశేషంగా అలంకరించిన పీర్లకు గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక పీర్ల చావిడి వద్ద బుధవారం అర్ధరాత్రి ఏర్పాటు చేసిన అగ్ని గుండం వద్ద వయస్సుతో సంబంధం లేకుండా వృద్ధులు సైతం కోలాహలంగా నృత్యాలు చేసి భక్తిని చాటుకున్నారు. చివరి రోజు గురువారం అగ్ని గుండాన్ని పూడ్చి వేసి గ్రామంలో కొలువుదీరిన పీర్లకు గ్రామ వీధుల్లో మేళతాళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. పీర్లు తమ ఇంటి ముందుకు వచ్చే సమయంలో మహిళలు నీరు పోసి పీర్లకు మొక్కుకున్నారు. అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని భక్తిని చాటుకున్నారు.